
సాక్షి సంగారెడ్డి

శనివారం ; 11 ; నవంబర్ ; 2023



బాద్‌షా ఎవరో?

హుస్నాబాద్ నియోజకవర్గంలో పోరు ఆసక్తిక రంగా మారింది. హ్యాట్రిక్ కోసం ఒకరు.. గెలుపే లక్ష్యంగా మరో ఇద్దరు పోటీ పడుతున్నారు. త్రిముఖ పోరు నెలకొంది. వివరాలు IIలో ▸



టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్

టిక్కెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్నే అమ్ముకుంటుందని అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతి విమర్శించారు. వివరాలు IIలో ▸



మీ బిడ్డగా సేవలందిస్తా

రాబోయే ఎన్నికల్లో మీ బిడ్డగా ఆశీర్వదించి మరోసారి గెలిపిస్తే మీ సేవకుడిగా పనిచే స్తానని బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

నేరుగా ఫిర్యాదు చేయొచ్చు

సంగారెడ్డి టౌన్: అసెంబ్లీ సాధారణ ఎన్నికల దృష్ట్యా జహీరాబాద్, సంగారెడ్డి అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన ఫిర్యాదులు ఏవైనా ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సాధారణ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ పవన్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఉల్లంఘనలు, ఫిర్యాదులుంటే ఫోన్ నెంబర్ 87121 92115కు ఫిర్యాదు /సంప్రదించవచ్చని కోరారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

- కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా సంయుక్త స్కూల్ యాజమాన్య, విద్యార్థులు శుక్రవారం కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దీపావళి పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ అశోక్, డీఆర్‌ఓ నగేష్, స్కూల్ డైరెక్టర్ రితేష్‌గౌడ్, తేజస్‌గౌడ్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఆరు లారీలు, ఏడు ట్రాక్టర్ల సీజ్

సంగారెడ్డి: జిల్లాలో స్పెషల్ టాస్క్‌పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వివరాలు.. ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన ఆంజనేయులు గ్రామ శివారులో అక్రమంగా ఇసుక ఫిల్టర్ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నాలుగు లారీల ద్వారా అక్రమ రవాణా చేస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలు, ఏడు ట్రాక్టర్లను సీజ్ చేశారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

జహీరాబాద్ టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను నిధులను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి రాజేష్ కోరారు. స్కాలర్‌షిప్ విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉన్నారన్నారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రాక ఫీజులు కట్టాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్, సందీప్, అరుణ్, అజర్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న రాంచందర్

జహీరాబాద్ టౌన్: నిమ్జ్ కోసం సేకరించిన భూములకు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిమ్జ్ భూబాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ మొదటి విడతగా పలు గ్రామాల్లోని వేల ఎకరాలలో భూమిని సేకరించారని, రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించలేదన్నారు. ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న ధరణి వల్ల రైతులకు తిప్పలు తప్పడం లేదన్నారు. దశాబ్దాల నుంచి పంటలు సాగుచేసుకుంటున్న భూములకు సంబంధించి కొంత మంది రైతులకు ఇంత వరకు పట్టాపాసు పుస్తకాలు ఇవ్వలేదన్నారు. పలు మార్లు ఆర్డీఓ, తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇచ్చిన లాభం లేదన్నారు.

మజ్లిస్‌తో ముస్లింలకు ఒరిగేదేమీ లేదు

రజాయి ఇలాహి ఫౌండేషన్ చైర్మన్ సయ్యద్ సలీం

జహీరాబాద్: మజ్లిస్ పార్టీతో ముస్లిం మైనార్టీలకు ఒరిగేదేమీ లేదని రజాయి ఇలాహి ఫౌండేషన్ చైర్మన్ సయ్యద్ సలీం అన్నారు. శుక్రవారం రాత్రి జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మజ్లిస్ పార్టీ పరోక్షంగా బీజేపీకే మద్దతు పలుకుతోందన్నారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తోందన్నారు. ముస్లిం మైనార్టీలు అనేక పేదరికంలో ఉన్నా వారికి మైనార్టీ బంధు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో మైనార్టీలు మజ్లిస్ ఉచ్చులో పడకుండా కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని కోరారు. ఉత్తర ప్రదేశ్‌లో ఆజంఖాన్ కుటుంబాన్ని పలు కేసుల్లో జైలులో పెట్టారన్నారు.

ట్విస్టుల మీద ట్విస్టులు

ఆఖరి రోజు అనూహ్య పరిణామాలు

- ఖేడ్‌లో షెట్కార్‌ను మార్చి సంజీవరెడ్డికి బీఫారం
- సంగారెడ్డి బీజేపీ అభ్యర్థుల జాబితాలో దేశ్‌పాండేకు చోటు
- బీఫారం మాత్రం పులిమామిడి రాజుకే ఇచ్చిన బీజేపీ



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: నామినేషన్ల చివరి రోజు శుక్రవారం అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పలు చోట్ల అభ్యర్థులను మార్చడం ఆయా నియోజకవర్గాల్లో రాజకీయం ఆసక్తికరంగా మారింది. నారాయణఖేడ్ కాంగ్రెస్ టికెట్‌ను అధిష్టానం రెండు రోజుల క్రితం మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్‌కు ప్రకటించింది. దీంతో టికెట్ దక్కని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తీవ్ర అసమ్మతి వ్యక్తం చేశారు. కార్యకర్తలతో సమావేశమై స్వతంత్రంగానైనా బరిలో నిలుస్తానని ప్రకటించారు. దీంతో అధినాయకత్వం రంగంలోకి దిగి.. షెట్కార్, సంజీవరెడ్డిలతో చర్చించి సయోధ్య కుదిర్చింది. షెట్కార్ స్థానంలో సంజీవరెడ్డికి బీ-ఫారం ఇచ్చింది. ఈ ఎన్నికల్లో సంజీవరెడ్డి గెలుపు కోసం కలిసి పనిచేస్తామని షెట్కార్ వర్గం ప్రకటించింది. ఈ మేరకు ఇరువర్గాల నేతలంతా కలిసి సంజీవరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. పటాన్‌చెరు నియోజకవర్గం టికెట్ అనూహ్యంగా కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు దక్కడంతో నీలం మధు ఆ పార్టీకి రాజీనామా చేశారు. బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తడిగుడ్డతో తన గొంతు కోసిందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బీఎస్పీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. నీలం మధుకు తొలుత కాంగ్రెస్ అభ్యర్థిత్వం ప్రకటించిన విషయం విదితమే.

సంగారెడ్డి బీజేపీ టికెట్ బిగ్ ట్విస్ట్

సంగారెడ్డి బీజేపీ టికెట్ విషయంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ టికెట్‌ను ఆ పార్టీ నాయకుడు పులిమామిడి రాజుకు కేటాయించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర నాయకత్వం ఆయనకు గురువారం రాత్రి సమాచారం ఇచ్చింది. ఈ మేరకు నామినేషన్ వేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించింది. తీరా శుక్రవారం ఉదయం విడుదల చేసిన తుది జాబితాలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే పేరును ప్రకటించింది. కానీ బీ-ఫారం మాత్రం రాజుకు ఇచ్చింది. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన దేశ్‌పాండే.. స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద విలపించారు. తనకు టికెట్‌ను ఎందుకు ప్రకటించారు..? ఎందుకు మార్చారంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఫోన్ చేసి ప్రశ్నించారు. ఐదేళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న తనను అవమానించారంటూ వెక్కివెక్కి ఏడ్చారు. తాను, తన కుటుంబం ఆత్మహత్య చేసుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో దేశ్‌పాండే అనుచరులు బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడ ఉన్న ఫ్లెక్సీలను చించివేశారు. బీ-ఫారంతో నామినేషన్ వేసేందుకు అటువైపు వెళుతున్న బీజేపీ అభ్యర్థి పులిమామిడి రాజు వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారు. దీంతో అక్కడ కొంత ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు వారిని అక్కడి నుంచి చెదరగొట్టారు.

నామినేషన్ వేసిన ఇద్దరు

చివరి నిమిషంలో బీజేపీ బీ-ఫారం దక్కకపోవడంతో రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే శుక్రవారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో తాను బరిలో నిలుస్తానని తేల్చి చెప్పారు. మరోవైపు బీజేపీ బీఫారం దక్కిన పులిమామిడి రాజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. గురువారమే ఒక సెట్ నామినేషన్ వేసిన రాజు, శుక్రవారం బీజేపీ బీ-ఫారంతో మరోసెట్ నామినేషన్ వేశారు.

బీజేపీ టికెట్ రాజుకే..

- అనూహ్య పరిణామాల మధ్య బీ-ఫారం



పులిమామిడి రాజు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి బీజేపీ అభ్యర్థిత్వం అనూహ్య పరిణామాల మధ్య ఆ పార్టీ నాయకులు పులిమామిడి రాజుకే దక్కింది. నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన శుక్రవారం ఆయనకు పార్టీ అధినాయకత్వం బీ-ఫారం అందజేసింది. తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పులిమామిడి రాజు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి సదాశివపేట మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. కొన్ని నెలల క్రితమే ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. జిల్లాలో ముదిరాజ్ సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉండటంతో ఆ పార్టీ అధినాయకత్వం రాజు వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. పులిమామిడి రాజు పీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు కూడా చేశారు. ఈ మేరకు రాజు శుక్రవారం బీజేపీ బీ-ఫారంతో నామినేషన్ దాఖలు చేశారు.

బయోడేటా

పేరు : పులిమామిడిరాజు
తల్లిదండ్రులు : పులిమామిడి మల్లయ్య, భాగమ్మ
స్వస్థలం : సదాశివపేట
పదవులు : తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు
సదాశివపేట మున్సిపల్ కౌన్సిలర్
వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు
పీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కాట శ్రీనివాస్ గౌడ్



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న నీలం మధు ముదిరాజ్

పోటాపోటీగా నామినేషన్లు

- కాటా, నీలం భారీ ర్యాలీలు
- నినాదాలతో హోరెత్తించిన కార్యకర్తలు
- రిటర్నింగ్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులో శుక్రవారం ఆయా పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్‌లు దాఖలు చేశారు. నామినేషన్లకు శుక్రవారం చివరి తేదీ కావడంతో కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్ అశోక్‌నగర్ తన నివాసం నుంచి పెద్ద ఎత్తున ర్యాలీతో, అదే విధంగా పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామం నుంచి బీఎస్పీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌లు భారీ ర్యాలీతో పటాన్‌చెరు ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ముందుగా నీలం మధు బీఫామ్ ఇచ్చేందుకు లోనికి వెళ్లగా, తన వెంట వచ్చిన నాయకులు, కార్యకర్తలు కార్యాలయం బయట ఉన్నారు. అప్పుడే కాటా శ్రీనివాస్ గౌడ్ పెద్ద ఎత్తున ర్యాలీగా రావడంతో నీలం మధు అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ముందుగా నీలం మధు నామినేషన్ ప్రక్రియను పూర్తి చేయించి పంపారు. అనంతరం కాట శ్రీనివాస్ గౌడ్ తన బీఫామ్‌తో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజాకు అందజేశారు. చివరి రోజు 18 మంది నామినేషన్లు వచ్చినట్లు దేవుజా తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

జిల్లాలో మొత్తం 175 మంది నామినేషన్లు

సంగారెడ్డి: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల ఘటం ముగిసింది. జిల్లాలో 3వ తేదీ నుంచి శుక్రవారం 10వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. 13న నామినేషన్ల పరిశీలన ,15న విత్ డ్రాలు, 30న ఎన్నికలు డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. గురువారం వరకు 94 నామినేషన్లు దాఖలు కాగా, చివరి రోజైన శుక్రవారం ఒకే రోజు అత్యధికంగా 81 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. అందోల్ నియోజకవర్గంలో 15 నామినేషన్లు, జహీరాబాద్‌లో 23, పటాన్‌చెరులో 18 నామినేషన్లు, సంగారెడ్డిలో 16, నారాయణఖేడ్‌లో 09 చొప్పున నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజక వర్గాల్లో మొత్తం 175 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఉద్యాన పంటలతో పోషకాహార భద్రత

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నర్సింహరావు

జహిరాబాద్ టౌన్: ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం వల్ల పోషకాహార భద్రత లభిస్తుందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నర్సింహరావు అన్నారు. హైదరాబాద్‌లోని రాజేందర్‌నగర్ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల విద్యార్థులు మూడు నెలలుగా జహీరాబాద్ ప్రాంతంలో ఉద్యాన పంటల సాగుపై పరిశోధనలు చేశారు. శుక్రవారం రంజోల్ రైతు వేదికలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహరావు మాట్లాడుతూ వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు సాగుకు ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని అధిక లాభాలు అర్జించాలని కోరారు. రాజేందర్‌నగర్ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యా న అధికారి వెంకటేశ్వర్లు, ఫల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సుచిత్ర, హరికాంత్, నితీష్‌కుమార్, జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, వ్యవసాయ అధికారిణి ప్రవీణ, ఏఓ ప్రదీప్ కుమా ర్, ఉద్యాన శాఖ అధికారిణి అనూష రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శైలజ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నర్సింహరావు

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే

- మాటలకు చేతలకు పొంతన ఏదీ..? • నర్సాపూర్‌లో మంత్రి హరీశ్‌రావు



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

నర్సాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటే వంచన.. మోసమని, కేసీఆర్ అంటే నమ్మకం అని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం ఆగమైతదని, ఆ పార్టీ నాయకులు మాయ మాటలు చెప్తారని విమర్శించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కట్ అవుతుందని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కొడంగల్‌లో తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని గతంలో చెప్పారని.. అలాగే.. 2018లో కాంగ్రెస్ అధికారంలోకి రాకుంటే తాను గడ్డం తీసుకోనని ఆ పార్టీ నాయకుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించి మాట తప్పారని విమర్శించారు. మాట తప్పే నాయకులు కావాలా మాట మీద ఉండే కేసీఆర్ అవసరమా అని ఆలోచించాలని కోరారు. రేవంత్‌రెడ్డి పట్టపగలు రూ.50లక్షలు లంచం ఇస్తూ దొరికాడని ఆరోపించారు. రైతులను కేసీఆర్ రాజులుగా చేస్తే రైతు బంధు బిచ్చమేసినట్లుగా ఉందని రేవంత్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ఉత్తదేనని, కేసీఆర్ మాట మీద ఉంటారని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ డకౌట్ అవుతుందని, కాంగ్రెస్ రనౌట్ అవుతుందని, కేసీఆర్ సెంచరీ ఖాయమని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి పాల్గొన్నారు.

అసత్యపు ప్రచారాలు నమ్మొద్దు

- ప్రజలకు ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచన

సంగారెడ్డి: సోషల్ మీడియాలో వచ్చేఅసత్యపు ప్రచారాలను నమ్మొద్దని ఎస్పీ చెన్నూరి రూపేశ్, పోలీస్ అబ్జర్వర్ దయాల్ గ్యాంగ్ వర్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల పారదర్శకతపై ఎలాంటి సందేహాలున్నా జిల్లా ప్రజలు నేరుగా నా ఫోన్ నంబర్ 87126 56716 ను సంప్రదించాలని కోరారు. ఐదు నియోజకవర్గాల పోలింగ్‌కు సంబంధించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల బందోబస్తు వివరాలు, చెక్ పోస్టులు, పోలింగ్ స్టేషన్స్, రూట్స్ తదితర అంశాల గురించి వివరించారు.

రూ.10 లక్షలు మాయం

- వెలుగులోకి మరో సైబర్ మోసం
- విద్రోహశక్తులతో సంబంధాలున్నాయంటూ బెదిరింపు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పటాన్‌చెరు టౌన్: మరో సైబర్ మోసం వెలుగు చూసింది. సంఘ విద్రోహ శక్తులతో సంబంధాలున్నాయంటూ బెదిరించి ఏకంగా రూ.10లక్షలు కాజేశారు. ఈ సంఘటన అమీన్‌పూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అమీన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తికి అక్టోబర్ 6న నీకు సంఘ విద్రోహ శక్తులతో సంబంధాలున్నాయని, లక్నో కస్టమ్స్ కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నామని, నీకోసం ఢిల్లీ పోలీసులు వస్తున్నారని బెదిరించారు. ఆ తరువాత అపరిచిత వ్యక్తి బాధితునికి మెసేజ్ రూపంలో ఓ లింకు పంపి దాన్ని క్లిక్ చేసి వచ్చిన ఓటీపీని చెప్పమన్నాడు. దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా లింకు ద్వారా వచ్చిన ఓటీపీని చెప్పగా అతని బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.పది లక్షలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు ముందుగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్ కార్డ్ రివార్డ్స్ గడువు ముగుస్తుందని చెప్పి..

క్రెడిట్ కార్డ్ రివార్డ్స్ గడువు ముగుస్తుందని వాటిని అప్‌డేట్ చేసుకోవాలని వచ్చిన మెసేజ్‌కు స్పందించి బాధితులు రూ.లక్షా 20 వేలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక పీజేఆర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి అక్టోబర్ 9న తన ఫోన్‌కు రివార్డ్స్ సంబంధించిన మెసేజ్ వచ్చింది. బాధితుడు మెసేజ్ కు స్పందించి లింక్ క్లిక్ చేశాడు. దీంతో అతడి ఖాతాలో ఉన్న రూ.లక్షా 20 వేలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉల్లి.. ఘాటెక్కింది మళ్లీ..!

మార్కెట్‌లో కిలో రూ.80కి అమ్మకాలు

- కొనలేని స్థితిలో సామాన్యులు
- కోతకు రాకముందే మండుతున్న ధరలు
- దిగుబడి తగ్గడమే కారణమంటున్న వ్యాపారులు



సదాశివపేట మార్కెట్‌కు ఉల్లిగడ్డను అమ్మకానికి తీసుకువచ్చిన రైతులు

సదాశివపేట (సంగారెడ్డి): కోస్తుంటేనే కన్నీళ్లు తెప్పించే ఉల్లి.. ఇప్పుడు కొంటుంటే ఘాటెక్కుతోంది. బహిరంగ మార్కెట్లలో ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రిటైల్ మార్కెట్లోనూ ఉల్లి ధరలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. సరిగ్గా దసరా పండుగకు ఇరవై రోజుల క్రితం సదాశివపేట పట్టణ వీధుల్లో వాహనాల్లో ఉల్లిగడ్డ తీసుకొచ్చి వందకు ఆరు, పదు కిలోల చొప్పున విక్రయించారు. రిటైల్‌గా రూ 20 కిలో చొప్పున అమ్మారు. దసరా పండుగకు ముందు అమాంతంగా ధర పెరగడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు, హోటళ్లు, తినుబండారాలు, ఆహారాల దుకాణాల వారు ఉల్లిధర పెరగడంతో వాటి వినియోగాన్ని తగ్గించారు, సదాశివపేటకు వచ్చిన గ్రామీణులు ఉల్లిధర విని అమ్మో అంటున్నారు, మరో నెల రోజుల తర్వాత గాని ఉల్లిధరలు తగ్గుముఖం పట్టదని డీలర్లు పేర్కొంటున్నారు.

జూలై నుంచి అక్టోబర్ మధ్య ఉల్లి ధరలను పోల్చి చూస్తే ధరలో దాదాపు 50 శాతం పెరిగింది. జూలైలో రూ.20 ఉండగా అక్టోబర్, నవంబర్‌లో 50 నుంచి 80కి పెరిగింది. ఈ విధంగా చూస్తే ఉల్లి సగటు ధరలు 50 శాతం పెరిగాయి, మహారాష్ట్రంలోని హోల్‌సెల్ మార్కెట్‌లో కూడా ఉల్లిధరలు భారీగా పెరగడంతో దాదాపు 30 శాతం మేర ఉల్లిని విక్రయిస్తున్నారని సమాచారం.

సాగు విస్తీర్ణం తగ్గడంతోనే..

మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తెలంగాణకు ఉల్లి దిగుమతి అవుతుంటాయి. గత వానాకాలం సీజన్‌లో ఆయా రాష్ట్రాల్లో ఉల్లిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో ఉల్లికి కొరత ఏర్పడి ధరలు పెరిగిపోతున్నాయని వ్యాపారాలు చెబుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో 2,596 ఎకరాల్లో ఉల్లి సాగు చేస్తున్నారు. జిల్లాలోని నారాయణఖేడ్, మనూరు, కంగ్టి, సదాశివపేట, కొండాపూర్, సంగారెడ్డి, కంది, మునిపల్లి, జహిరాబాద్ తదితర మండలాల్లో ఉల్లి పంటను ఎక్కువగా సాగు చేస్తుంటారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా వెయ్యి ఎకరాల వరకు సాగు చేస్తున్నారు, సదాశివపేట మండలం అరూర్, నందికంది, పెద్దాపూర్‌తో పాటు కొండాపూర్ మండలం గొల్లపల్లి, మునిదేవునిపల్లి, మన్‌సాన్‌పల్లి, మల్లేపల్లి, అనంతసాగర్, మారేపల్లి, గంగారం, గ్రామాల్లో ఉల్లి సాగుచేస్తారు. సాధారణంగా ఉల్లిని అధిక భాగం దేశంలోని మహారాష్ట్ర, కర్నాటక తర్వాత ఏపీలోని కర్నూలు జిల్లాల్లో సాగవుతుంది, అయితే ఈ ఏడాది కర్నూలు జిల్లాలో రుతుపవనాలు అలస్యంగా రావడం, వచ్చిన అసమానంగా ఉండటం, తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, పంటలు రాక ఆలస్యమవడంతో ఉల్లి లభ్యత తగ్గింది. దీంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఉల్లిధరలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కొరుతున్నారు.

క్లుప్తంగా

పొన్నం ఓటమి ఖాయం

హుస్నాబాద్: కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నుంచి మూడుసార్లు పోటీ చేస్తే అక్కడి ప్రజలు ఓడిస్తే ఇక్కడికి వచ్చాడని నాలుగోసారి కూడా ఓడిపోవడం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 8, 9, 18, 19వ వార్డుల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్‌లో చెల్లని రూపాయి ఇక్కడ ఎలా చెల్లుతుందన్నారు. వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, మళ్లీ నన్ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, తదితరులు పాల్గొన్నారు.

కుంటుపడిన అభివృద్ధి

హుస్నాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం చార్జిషీట్ విడుదల చేస్తున్నట్లు హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏడు మండలాల పార్టీ అధ్యక్షులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వైఫల్యాలపై చార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. హుస్నాబాద్‌ను సెంటిమెంట్‌గా తీసుకొని ఇక్కడ సీఎం కేసీఆర్ సభ నిర్వహించారని, డెవలప్‌మెంట్ మాత్రం సిద్దిపేట, గజ్వేల్‌కు పరిమితమైందన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అమ్ముడుపోతారు

హుస్నాబాద్: కాంగ్రెస్‌కి ఓటు వేస్తే గెలిచిన తర్వాత అభ్యర్థులు అమ్ముడుపోతారని హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నారు. చివరి రోజు నామినేషన్ ప్రక్రియలో భాగంగా పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీరాంచక్రవర్తి మాట్లాడుతూ.. మా తండ్రి బొమ్మ వెంకటేశ్వర్లు ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. 20 ఏళ్లు మా తండ్రి, 20 ఏళ్లు తాను నియోజకవర్గ సమస్యలపై పోరాడిన చరిత్రఅని అన్నారు. బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, నియోజకవర్గ నాయకురాలు మంజుల రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు భారీ మెజార్టీ ఖాయం : వంటేరు


జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్ అసెంబ్లీ అభ్యర్థిగా మూడోసారి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పీర్లపల్లి, ధర్మారం, కొత్తపేట, ఇటిక్యాల, లింగారెడ్డిపల్లి, బీజీ వెంకటాపూర్, తీగుల్, రాంనగర్ తదితర గ్రామాల్లో జగదేవ్‌పూర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రాధాకృష్ణశర్మతో కలిసి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఎంపీపీ బాలేశంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరేశ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, కొండపోచమ్మ దేవాలయ పాలక మండలి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రశేఖర్, యాదవరెడ్డి, వెంకట్రాంరెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు, ఎంపీటీసీ కవిత, కావ్యదుర్గయ్య, కోఆప్షన్ సభ్యులు ఇక్బాల్, నాయకులు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాద్‌షా ఎవరో?


ఒడితెల సతీష్‌కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి


పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అభ్యర్థి


బొమ్మ శ్రీరాంచక్రవర్తి, బీజేపీ అభ్యర్థి


హుస్నాబాద్ పట్టణం వ్యూ

- ఉద్యమగడ్డపై ఆసక్తికర పోరు
- హ్యాట్రిక్ కోసం ఒకరు..
- మొదటిసారిగా గెలుపే లక్ష్యంగా మరో ఇద్దరు
- ప్రధాన పార్టీల మధ్య త్రిముఖ పోరు

హుస్నాబాద్: తెలంగాణ ఉద్యమ సమయంలో వెన్నుదన్నుగా సహాయ సహకారాలు అందించి, కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న ఒడితెల కుటుంబం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ మూడోసారి ముచ్చటగా ఎమ్మెల్యేగా విజయం సాధించాలని శ్రమిస్తున్నారు. ఎలాగైనా ఈసారి గెలిచి అసెంబ్లీలో తన గళం విప్పాలని కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ పట్టుదలతో ముందుకెళ్తున్నారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు వారసుడిగా మొదటిసారి ఎమ్మెల్యేగా బోణీ కొట్టి తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలని బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో హుస్నాబాద్‌లో ప్రధాన పార్టీల త్రిముఖ పోరుతో రాజకీయం రసవత్తంగా మారింది.

ఇందుర్తి నుంచి మొదలుకొని పునర్విభజనలో హుస్నాబాద్‌గా మారిన నియోజకవర్గంలోని ఓటర్లు ప్రతీ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇస్తున్నారు. రెండుసార్లు పీడీఎఫ్, ఆరు సార్లు సీపీఐ, మూడు సార్లు కాంగ్రెస్ విజయం సాధించాయి. తెలంగాణ సాధన అనంతరం బీఆర్ఎస్(టీఆర్ఎస్) వరుసగా విజయాన్ని దక్కించుకున్నాయి.ఈసారి ఎన్నికల్లో పోటీ రసవత్తరంగా మారడంతో ఎవరు గెలుస్తారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తాయి

ఒడితెల సతీష్‌కుమార్ 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2023లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలవాలని నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. సీఎం కేసీఆర్‌కు సెంట్‌మెంట్‌గా హుస్నాబాద్ నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభతో గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. అదే జోష్‌ను కొనసాగిస్తూ ఇప్పటికే సగం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధీమాతో ప్రచారాన్ని ఉధృతం చేశారు. పదేళ్లకాలంలో తాను చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. 2018లో సతీష్‌కుమార్ దాదాపు 73 వేలకు పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. ఈసారి లక్ష మెజార్టీ సాధించాలనే లక్ష్యంతో వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు నడుస్తున్నారు.

ఉద్యమకారుడిగా ప్రజల్లోకి...

హుస్నాబాద్ నుంచి మొదటిసారిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. కరీంనగర్ ఎంపీగా పని చేసిన అనుభవం, రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన నాయకుడిగా ప్రజల్లోకి వెళ్తున్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించే విధంగా తెలంగాణ బిడ్డగా తన గళాన్ని వినిపించి పేపర్ స్ప్రేకు గురై తెలంగాణ ఉద్యమ నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తామని ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్, సీపీఐ పొత్తుతో హుస్నాబాద్ సీటును కాంగ్రెస్‌కు కేటాయించిన విషయం విధితమే. సీపీఐ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. టికెట్ ఆశించి అలకబూనిన అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని అధిష్టానంతో మాట్లాడించి మచ్చిక చేసుకున్న పొన్నం ప్రభాకర్ ఎలాగైనా ఈసారి గెలవాలని పట్టుదలతో ఉన్నారు.

మోదీ పథకాలే గట్టెక్కిస్తాయి

హుస్నాబాద్ బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి మొదటిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగారు. శ్రీరాంచక్రవర్తి తండ్రి బొమ్మ వెంకటేశ్వర్లు 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. బొమ్మ వెంకటేశ్వర్లు వారసుడిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి, అయనకు ఉన్న పరిచయాలు తనకు కలిసి వస్తాయని ముందుకు సాగుతున్నారు. తండ్రి తర్వాత కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రజల్లో ఉంటూ సమస్యలపై పోరాటాలు చేశారు. కాంగ్రెస్‌ని అంటిపెట్టుకొని పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు. తదనంతరం జరిగిన పరిణామాలతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రోద్బలంతో శ్రీరాంచక్రవర్తి బీజేపీలో చేరారు. పార్టీ టికెట్ రావడంతో ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. ప్రధాని మోదీ పథకాలు, అభివృద్ధి పనులను జనంలోకి తీసుకెళ్తూ ప్రచారం చేస్తున్నారు.

జంగ్ తెలంగాణ

ఖేడ్ కాంగ్రెస్‌లో కుదిరిన సయోధ్య

- టికెట్ త్యాగం చేసిన సురేశ్ షెట్కార్
- అభ్యర్థిగా పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ కాంగ్రెస్ అభ్యర్థికి సంబంధించి శుక్రవారం ఊహించని విధంగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. పార్టీ టికెట్ కోసం మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్, మరో ఉపాధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పోటీపడ్డారు. అధిష్టానం సురేశ్ షెట్కార్‌ను అభ్యర్థిగా ప్రకటించి బీ-ఫామ్ సైతం అందజేసింది. వారం రోజులుగా ఇద్దరి మధ్య సయోధ్యకు కాంగ్రెస్ పెద్దలు యత్నించినా ఫలించలేదు. దీంతో కాంగ్రెస్ తరఫున సురేశ్ షెట్కార్, స్వతంత్ర అభ్యర్థిగా సంజీవరెడ్డి శుక్రవారం నామినేషన్ వేయడానికి నిర్ణయించుకొని అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని తమ తమ కార్యకర్తలను ఖేడ్‌కు పిలిపించుకున్నారు. ఉదయం సురేశ్ షెట్కార్, సంజీవరెడ్డిలతోపాటు వారి కుటుంసభ్యులు పంచగామకు వెళ్లి చర్చించుకున్నారు. పదేళ్లుగా తమ మధ్య వర్గవిభేదాల కారణంగా కార్యకర్తలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, అందుకే కలిసికట్టుగా ఉండి బీఆర్ఎస్ దౌర్జన్యాలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని నిర్ణయించుకున్నారు. తాను ఇదివరకు జహీరాబాద్ ఎంపీగా పని చేసినందున వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎంపీగా పోటీ చేస్తానని, తనకు వచ్చిన టికెట్‌ను సంజీవరెడ్డికి ఇస్తున్నట్లు షెట్కార్ అధిష్టానవర్గానికి వివరించారు. దీంతో అధిష్టానం ఆగమేఘాలమీద సంజీవరెడ్డి పేరిట బీ-ఫామ్‌ను పంపింది. సురేశ్ షెట్కార్, సంజీవరెడ్డిలు తమ తమ సోదరులతో కలిసి వెళ్లి సంజీవరెడ్డి నామినేషన్‌ను దాఖలు చేశారు.

టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్


గజమాలతో చంటి క్రాంతికిరణ్

- అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్ముతుంది
- అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్
- భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు

జోగిపేట (అందోల్): టిక్కెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్నే అమ్ముకుంటుందని అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. అందోల్ నియోజకవర్గ శాసన సభ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున చంటి క్రాంతి కిరణ్ నామినేషన్ దాఖలు చేశారు. చాముండేశ్వరి దేవాలయంలో నామినేషన్ పత్రాలకు సతీమణి పద్మావతితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జోగిపేట పార్టీ కార్యాలయం నుంచి ప్రత్యేక చైతన్య రతంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పదవి వ్యామోహంతో ఉన్న దామోదర్‌కు ఓటమి భయం పట్టుకుందని ఆరోపించారు. ఎలాగైనా గెలవాలని దామోదర్ సర్పంచ్‌కు రూ.5 లక్షలు, జెడ్పీటీసీకి రూ.20 లక్షలు, కౌన్సిలర్‌కి రూ.25 లక్షలు ఇస్తానని ఆశ చూపుతున్నాడని మండిపడ్డా రు. దామోదర్ కు చిత్తశుద్ధి ఉంటే అవే రూ.200 కోట్లు అందోల్ నియోజకవర్గ అభివృద్ధికి ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్‌సాధిస్తుందని, ఎన్నికల ప్రచారానికి అన్ని వర్గాల నుంచి అపూర్వ స్పందన వస్తుందన్నారు. ర్యాలీలో కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి డాన్సులు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్, జైపాల్‌రెడ్డి, కాశీనాథ్, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు మారుతీసాగర్ పాల్గొన్నారు.

రాజన్న.. చక్రం తిప్పన్న


కుమ్మరి సారెపై కుండ చేస్తున్న రాజనర్సు

సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 35, 36వ వార్డుతోపాటు పలు వార్డుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమ్మరి సారెపై కుండలు చేస్తూ, లాండ్రీ షాపు వద్ద ఇస్త్రీ చేస్తూ హరీశ్‌రావుకు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

–సిద్దిపేటకమాన్

అక్కా.. ఓటు కారుకే


బీడీలు చుడుతున్న నాయకులు

మండల పరిధిలోని కమలాయపల్లిలో జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం బీఆర్ఎస్ గ్రామ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఇంటి ఎదుట బీడీలు చుడుతున్న మహిళల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రూ.2 వేలు ఉన్న పెన్షన్ రూ.5వేలు అవుతుందని చెప్పారు. –చేర్యాల(సిద్దిపేట)

బీఆర్ఎస్‌లోకి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు


మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనార్దన్‌రెడ్డి, పక్కన దేవేందర్‌రెడ్డి

మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిన జనార్ధన్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్దన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ జనార్దన్‌రెడ్డికి కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. మెదక్ పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి గెలుపుకోసం సమష్టిగా కృషి చేయాలని మంత్రి కేటీఆర్ ఆయనకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కల్వకుంట సహకార సంఘం అధ్యక్షుడు అందె కొండల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పాడెండ్ల లక్ష్మణ్ యాదవ్, వెంకట్‌రెడ్డి, రమేశ్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు పిట్టకథలు నమ్మరు


మాట్లాడుతున్న రఘునందన్‌రావు

- ఆశీర్వదిస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి
- దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: సిద్దిపేట పెత్తనం మనకెందుకు.. ఇప్పటికే దుబ్బాక చైతన్యం, పౌరుషం చూపించాం అదిమరిచి మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతున్నాడని దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట- భూంపల్లి మండలంలోని పోతారెడ్డిపేట, చిన్ననిజాంపేట, రామేశ్వరంపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు దుబ్బాకలో ఎన్ని పిట్ట కథలు చెప్పినా ప్రజలు నమ్మరని అన్నారు. ఉపఎన్నికలో కర్రు కాల్చి వాతపెట్టారని గుర్తు చేశారు. దుబ్బాకపై ప్రభుత్వానికి మొదటి నుంచి సవతిపల్లి ప్రేమే అని విమర్శించారు. మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే అండగా ఉంటానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, మాయమాటలు చెప్పినా నమ్మవద్దన్నారు.

భారీగా చేరికలు

దుబ్బాక మండలం బల్వంతాపూర్ సర్పంచ్ భర్త కిష్టయ్యతో పాటు ఉపసర్పంచ్ దండుగుల యాదగిరి, వార్డు సభ్యులు అలాగే రఘోత్తంపల్లి ఉపసర్పంచ్ కంపె కవిత పర్శరాములు, పద్మశాలిగడ్డకు చెందిన 30 మంది బీఆర్ఎస్ నాయకులు రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

దుబ్బాక గడ్డపై మరోసారి..

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక గడ్డపై మరోసారి బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపసర్పంచ్ చెరుకు యాదగిరితో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో దుబ్బాక సమస్యలపై గొంతు విప్పి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లన్నగారి భిక్షపతి, కృష్ణ, స్వరూప, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా..

చేగుంట(తూప్రాన్): ఆదరించి గెలిపిస్తే అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని చిన్నశివునూర్, మక్కరాజీపేట గ్రామాల్లో శుక్రవారం రాత్రి రఘునందన్ రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచిన రెండున్నరేళ్లు ప్రజల మధ్యనే ఉండి వారి సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, మాజీ ఎంపీపీ పాండు, వైస్ ఎంపీపీ రాంచంద్రం, గణేశ్ రవికుమార్, నాయకులు వెంగళ్‌రావు, సంతోష్‌రెడ్డి, గోవింద్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలోనే కార్యకర్తలకు గుర్తింపు


రఘునందన్‌రావుతో కలిసి నామినేషన్ వేస్తున్న శ్రీకాంత్ రెడ్డి

సిద్దిపేటజోన్: బీజేపీలోనే కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉంటుందని, అవసరమైతే పోటీ చేసేందుకు టికెట్టు వస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట బీజేపీ అభ్యర్థి శ్రీకాంత్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్‌లో వారసత్వ రాజకీయాలు ఉంటాయని, అక్కడ వంద ఏళ్లు అయినా కార్యకర్తలకు టికెట్టు రాదని ఆరోపించారు. తండ్రి పోతే కొడుకు, కొడుకు పోతే మనువడు వస్తారని విమర్శించారు. అభ్యర్థి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... సిద్దిపేటలో డబ్బులున్న వారికి, పేదవానికి మధ్య పోటీ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ వెంకట్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు రామచందర్ రావు, విద్యాసాగర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- భూ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్
- రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న నవీన్ మిట్టల్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటఎడ్యుకేషన్: క్రీడలు విద్యార్థుల జీవితాల్లో అంతర్భాగం కావాలని, చదువుతోపాటు క్రీడల్లో ముందుంటే శారీరక, మానసిక దృఢత్వం ఉంటుందని ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్, భూపరిపాలన, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ నవీన్‌మిట్టల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్ –19 (ఎస్‌జీఎఫ్) జూనియర్ కళాశాలల ఫెడరేషన్ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని, గెలిచిన వారిని చూసి అసూయ పడకుండా వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ మాట్లాడుతూ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్నామని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని స్విమ్మింగ్ పూల్‌ను వినియోగించుకొని మెళకువలు నేర్చుకోవాలన్నారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్(టీజీఎల్ఏ)రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నుంచి అండర్ –19 క్రీడలను ఇంటర్ విద్యార్థులతో నిర్వహించిన ఘనత సిద్దిపేటకే దక్కిందన్నారు. అలాగే, జిల్లా ఇంటర్ విద్యాధికారి, అండర్ –19 క్రీడల చైర్మన్ సూర్యప్రకాశ్, కార్యదర్శి సమ్మయ్య, డీవైఎస్ఓ నాగేందర్, ప్రిన్సిపల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూచంగారి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సత్యనారాయణరెడ్డి, శారద, సురేష్‌రెడ్డి, భూపాల్‌రాజు, బుచ్చిరెడ్డి, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ రెఫరీ బోర్డు కన్వీనర్ రవీందర్‌రెడ్డి, క్రీడా పోటీల ఇన్‌చార్జి వెంకటేశ్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లీ దీవించమ్మా..

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ నర్సాపూర్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం మండల పరిధి దొంతి వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. నామినేషన్ వేసే ముందు ఆలయంలో పూజలు చేయడం ఆమెకు ఆనవాయితీ. కుటుంబ సభ్యులతో పూజలనంతరం నామినేషన్ వేసేందుకు వెళ్లారు.


పూజలు చేస్తున్న సునీతారెడ్డి


పూజలు చేస్తున్న రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి హరీశ్‌రావు భారీ మెజార్టీతో విజయం సాధించాలని శుక్రవారం మండల పరిధిలోని అనంతసాగర్ సరస్వతీ క్షేత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.